క్లుప్తంగా

సచివాలయాల తనిఖీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం : మండల పరిధిలోని బిదినంచర్ల, గురిజాల, హిమకుంట్ల గ్రామాల్లోని సచివాలయాలను శనివారం ఎంపీడీఓ కృష్ణమూర్తి తనిఖీ చేసి మాట్లాడారు. సచివాలయ సిబ్బందితోపాటు వలంటీర్లు కూడా తప్పనిసరిగా అటెండెన్స్ వేయాలని.. అలాగే అయుష్మాన్ భారత్ సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5గంటల వరకు స్పందన సమయంలో సచివాలయ సిబ్బంది తప్పక ఉండాలన్నారు.

నేడు గంగమ్మ జాతర

వీరపునాయునిపల్లె : మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో ఆదివారం, సోమవారం గంగమ్మ జాతర నిర్వహించనున్నట్లు జాతర కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 2 గంటలకు గంగమ్మ ప్రతిమను గ్రామ నడిబొడ్డున ప్రతిష్టించి పూజలు చేస్తారని అలాగే ఉదయం 6 గంటలకు నడివీధి గంగమ్మకు మొదటి బోనం, 10 గంటలకు రెండవ బోనం సమర్పిస్తారని, 3 గంటలకు బోగాదమ్మకు బోనం సమర్పిస్తారన్నారు. సోమవారం ఉదయం 3 గంటల నుంచి 5 గంటలలోపు నల్లనమ్మ, మారెమ్మ, అంకాలమ్మతల్లికి బోనాలు సమర్పించి అనంతరం గ్రామోత్సవంగా తీసుకెల్లి గ్రామ పొలిమేర వద్ద విడిచి రావడంతో జాతర ముగుస్తుందన్నారు.

ఫ్రిజ్, బీరువా వితరణ

లింగాల : మండలంలోని పెద్దకుడాల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కూల్ వాటర్ ఫ్రిజ్, బీరువాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐటీ అడ్వయిజర్ పెద్దమల్లు చంద్రహాసరెడ్డి శనివారం వితరణ చేశారు. అమెరికాలో ఉన్న ఆయన పంపిన వితరణను ఆయన తండ్రి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి పాఠశాలకు అందజేశారు.

ఉన్నత భవిష్యత్‌కు పది పునాది

పులివెందుల రూరల్ : విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు పదవ తరగతి పునాది అని ఎస్ఐ హుస్సేన్ తెలిపారు. శనివారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్ఐ హుస్సేన్, సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కుమార్‌లు హాజరై పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ చేరవేయండి

పులివెందుల టౌన్ : ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు సూచించారు. శనివారం పట్టణంలోని నగరిగుట్ట సచివాలయ పరిధిలోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాలతో మున్సిపల్ ఇన్‌చార్జి మనోహర్‌రెడ్డి పర్యవేక్షణలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాల గురించి చర్చించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు

ఎర్రగుంట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఏరువాక గంగమ్మతల్లి గంగజాతర సందర్భంగా పోటీలు నిర్వహించారు. అలాగే గంగమ్మజాతరలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డిలు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

ఆర్టీపీపీలో ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న అకౌంట్స్ సిబ్బంది

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఆకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఇతర సిబ్బంది తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ చేస్తున్న నిరసన శనివారం రెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ అకౌంట్‌లో విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఉదయం 10.30 గంటలకు విధులకు హాజరవుతుండేవారు. అయితే ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఉదయం 9 గంటలకే విధులకు హాజరు కావాలని ఏపీ జెన్‌కో ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేస్తూ నిరసన బాట పట్టారన్నారు.

సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ

చాపాడు : కళాశాలలో గత నెలలో ఎంపసిస్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 28 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కాలేజీ చైర్మన్ వి.జయచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనలియర్ సీఎస్‌సీ, ఈసీఈ, ఈఈఈ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికయ్యాయరు. వీరికి సంవత్సర ఆదాయం రూ.3.20 లక్షలు కంపెనీ నిర్ణయించిందని చైర్మన్ తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయి

ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి



మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

పెద్దముడియం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుల, మతాలు పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ పేదలకు న్యాయం చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన పెద్దముడియం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం మూడున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అనంతరం వారి సమస్యలను తెలుసుకుని అక్కడే ఉన్న అధికారులతో పరిష్కరించాలని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి కూడా ప్రభుత్వ పథకాలు అందనివారు ఉంటే తెలుపాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా–వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పేదలకు మంచి జరుగుతుంటే ఓర్వలేని స్వార్థ నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చవ్వా కృష్ణారెడ్డి, సి.ఈశ్వర్‌రెడ్డి, గ్యాస్ శివారెడ్డి, ప్రణయ్‌రెడ్డి, అంజిరెడ్డి, మధుసుదన్‌రెడ్డి, నసురుద్దీన్ , ప్రసాద్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, తిమ్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, అధికారులు వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత చెక్కును ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలోని 525 పొదుపు గ్రూపులకుగాను 5,250 మంది మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4,20 కోట్ల మెగా చెక్కును పంపిణీ చేయడం జరిగిందన్నారు. మండలంలోని 525 గ్రూపులకు గాను మూడు విడతల్లో రూ.12,61,73,439 పంపిణీ చేశామన్నారు. గతంలో చంద్రబాబునాయుడు పసుపు కుంకుమ పేరుతో మోసం చేశారని విమర్శించారు. ఐదేళ్ల కాలంలో ఎన్నికలకు ముందు రూ.10 వేలు ఇచ్చి వారిని మభ్యపెట్టినా జగనన్న మాత్రం సగటున ప్రతి గ్రూపునకు రూ.2 లక్షల వరకు మాఫీ చేశారన్నారు. ప్రజలు గత టీడీపీ పాలన, ప్రస్తుత పాలనలో తేడాలు గమనించాలని ఆయన కోరారు. అనంతరం మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి, ఎంపీపీ కె.కె.సుధ. జడ్పీటీసీ సి.హిమజ, ఉప ఎంపీపీ కిరణ్మయి, సర్పంచ్ అమీనా, మండల కన్వీనర్ చవ్వా కృష్ణారెడ్డి, ఉపా ధిహామీ కౌన్సిల్ సభ్యులు నరసింహులు, సి.విశ్వనాథరెడ్డి, సుధాకర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

తనిఖీలో రూ.13.50 లక్షల రికవరీ



మాట్లాడుతున్న అడిషనల్ పి.డి. ఖాదర్‌బాషా

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనుల కోసం దాదాపు రూ.9 కోట్ల 46 లక్షలు ఖర్చు చేయగా వాటిలో రూ.13 లక్షల 46 వేల 445 రికవరీ చేసినట్లు అడిషనల్ పి.డి. ఖాదర్‌బాషా తెలిపారు. శనివారం మైలవరం మండల ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మండల సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని ఎంపీడీవో వై.రామచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నిచోట్ల పనులు పారదర్శకంగా లేకపోవడంతో రికవరీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎ.పి.ఓ. లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటసుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ హరిత సరిగా నిద్ర లేకపోవడం, ముందులాగా పని చేయలేకపోవడం, తలనొప్పి, ఆందోళనగా ఉండటం, టెన్షన్, దడ, చమటలు పట్టడం, భయంగా ఉండటం, ఆలోచనలు అదుపులో లేకపోవడం తదితర జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రకృతి విపత్తులను ఎదుర్కోవచ్చు



రక్షించే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

కమలాపురం : భూ కంపాలు, వరదలు లాంటి విపత్తులు సంభవించినప్పుడు కొంత మేరకు అవగాహన కలిగి ఉంటే వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని విజయవాడలోని 10వ పటలం టీమ్ కమాండర్ శివకుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో సచివాలయ, రెవెన్యూ, ఆశా వర్కర్లుకు విపత్తులను ఎదుర్కోవడంలో ఒక రోజు శిక్షణలో భాగంగా ఎన్‌డీఎర్‌ఎఫ్ సేవలను డెమో ద్వారా చేసి చూపించారు. అలాగే హార్ట్‌ఎటాక్‌కు గురైనప్పుడు కూడా వారికి సీపీఆర్ అందించవచ్చన్నారు. విపత్తులు సంభవించినపుడు డిపార్ట్‌మెంట్ కొన్ని వస్తువులు ఇస్తుందని, అవి లేనప్పుడు కూడా కొన్ని వస్తువులను తయారు చేసుకోవచ్చన్నారు. ఖాళీ నీళ్ల బాటిళ్లను, ఎండు టెంకాయలు, ప్లాస్టిక్ వస్తువులను తాడుతో కట్టి నడుము చుట్టూ కట్టుకుని నీటిలో దిగి బాధితులను రక్షించవచ్చన్నారు. ఆపద సమయాల్లో క్షతగాత్రులను రక్షించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రామకృష్ణ, సందీప్, లక్ష్మయ్య, సత్యరాజ్, జీవ, జడేజా, ఎంపీడీఓ చలపతి, డీటీ ఇస్మాయిల్, ఆర్ఐ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, తదితరులు

వేంపల్లె : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి చల్లా బాలాజి సొంత నిధులతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన మానవత సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, చైర్మన్ చక్రపాణిరెడ్డిలు ప్రారంభించి మాట్లాడారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, అందుకు తన వంతు సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్లు రాటాల గోపి, రామాంజనేయరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రతాప్ రెడ్డి, అధ్యక్షుడు కావలి కృష్ణతేజ, ఉపాధ్యక్షుడు ఎస్. ఓబుళరెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే చింతలమడుగుపల్లె గ్రామంలోని సచివాలయం వద్ద చలివేంద్రాన్ని ఎంపీటీసీ పఠాన్ రహమతుల్లా ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి కొండయ్య, కో ఆప్షన్ సభ్యుడు అసానయ్య, వార్డు సభ్యుడు బాలరాజు, సచివాయల కన్వీనర్ యూసఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలి

పులివెందుల రూరల్ : చదువులో ఉన్నతంగా రాణించి పది మందికి ఉపాధి కల్పించేస్థాయికి చేరుకోవాలని అనంతపురం జెఎన్‌టీయూ వైస్ చాన్సలర్ జి.రంగజనార్ధన్ తెలిపారు. శనివారం పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో ప్రిన్సిపాల్ వసుంధర ఆధ్వర్యంలో 17వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ రంగజనార్ధన్ మాట్లాడుతూ క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య ద్వారా ఎంత స్థాయికైనా ఎదగవచ్చునన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచంలో జరిగే సాంకేతికపరమైన మార్పులకు అనుగుణంగా కొత్త నైపుణ్యాలు నేర్చుకుంటూ కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకన్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణారెడ్డి, స్టూడెంట్ యూనియన్ కో ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖైదీల సంక్షేమానికి ప్రాధాన్యత

కడప అర్బన్ : ఖైదీలకు మెరుగైన వైద్య సదుపాయాలతో పాటు, సౌకర్యాలను అందించాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత అన్నారు. శనివారం జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో కడప కేంద్రకారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాలని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులలో జడ్జి మాట్లాడుతూ మానసిక వ్యాధులతో ఉన్న ఖైదీలకు సరైన వైద్య సదుపాయాలను కల్పించాలన్నారు. దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 30 మంది మహిళా ఖైదీలకు ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కడప కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్ జవహర్‌బాబు, ప్రత్యేక మహిళా కేంద్ర కారాగారం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణవేణి, పారాలీగల్ వలంటీర్ సురేష్ సహాయం, దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ ఓబులదాసు, ఖైదీలు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఉన్న జామియా మసీద్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు నిర్వహించారు. శనివారం జామియా మసీద్ పీఠాధిపతి సయ్యద్ సాధిక్ బాషా ఖాద్రీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు నిర్వహించిన ఇఫ్తార్ విందులో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పొరెడ్డి మహేశ్వరరెడ్డి, డాక్టర్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు ముల్లాజానీ, గౌరీనాథ్‌రావు, కో ఆప్షన్ సభ్యుడు ఫయాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

ముద్దనూరు : స్థానిక మేజర్ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ, ట్రాక్టర్ సిబ్బందికి యూనిఫాంను శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బోనం సరళ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీరాంజనేయరెడ్డి, పంచాయతీ కార్య నిర్వహణాధికారి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

కడప ఎడ్యుకేషన్ : క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరుకోగలరని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరం రామాంజనేయపురంలోని ఉర్దూ రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ, అంకిత భావం, ఆత్మ విశ్వాసం ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివే బదులు ఇష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీఓ రజనీకాంతరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారకులను శిక్షించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పశు సంవర్ధకశాఖ డీడీ అచ్చన్న మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని అఖిలపక్ష నాయకులు చంద్ర, చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. డీడీ అచ్చన్న మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ శనివారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో అఖిలపక్ష పార్టీ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించని పక్షంలో ఈ నెల 8న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఒంటిపూట తరగతులు

ఏఎఫ్‌యూ : కడప నగర పరిధిలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈనెల 3వ తేదీ సోమవారం నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పరీక్ష కిట్‌ల వితరణ

ముద్దనూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నతపాఠశాలలో 10వ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు డాక్టర్ పాతకోట శ్రీనాథరెడ్డి పరీక్ష కిట్‌లను వితరణగా అందజేశారు. శనివారం పాఠశాలలో విద్యార్థినులు సరస్వతీపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి తెలిపారు.

శ్రీరామకోటి పుస్తకాల విడుదల

బద్వేలు : పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పరిధిలో ఉన్న లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు స్థానిక సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీరామకోటి పుస్తకాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా రామకోటి పుస్తకాలను ప్రగతి శ్రీనివాసులు, బయన నాగేంద్రరెడ్డి, తాటసాని వెంకటరెడ్డి, కాకర్ల బాలుడు, తులసిసురేష్, సిద్ధమూర్తి రాజారెడ్డి తదితరులు ప్రచురించారని, రామకోటి రాయదలచిన భక్తులకు వీటిని అందజేస్తున్నామన్నారు.

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ల ప్రారంభం



నూతన ఆర్‌ఓ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి

సింహాద్రిపురం : మండల పరిధిలోని కోవరంగుంటపల్లె, అంకాలమ్మగూడూరు, దుద్దేకుంట్ల, నంద్యాలంపల్లె, సుంకేసుల గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఒక్కొక్క వాటర్ ప్లాంటుకు రూ.7.50 లక్షలు వెచ్చించి ప్లాంట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలో భాగంగా ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటానికి ఈ మంచినీటి ప్లాంట్లు ఉపయోగపడుతాయన్నారు. అంతకముసుపు అంకాలమ్మ గూడూరులో అంకాలమ్మతల్లి అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో పాడా నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కిశోర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, హరినాథరెడ్డి, వెలుగోటి చంద్రశేఖరరెడ్డి, ద్వారకనాథ రెడ్డి, మహేశ్వరరెడ్డి, అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, ఆయా గ్రామాల వైస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నోట్లరద్దు ముసుగులో ప్రైవేటీకరణ

కమలాపురం : బీజేపీ ప్రభుత్వం నగదీకరణ ముసుగులో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరణ చేస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనువాసులురెడ్డి తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ విశాఖలో నిరసన దీక్షలు చేపట్టి 700 రోజులు పూర్తి అయిన నేపథ్యంలో శనివారం కమలాపురంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ ముద్రించిన ×ప్రజల ఆస్తులను కారుచౌకగా కార్పొరేట్‌లకు ధారాదత్తం చేయడమే మోనిటైజేషన్÷ అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం నగదీకరణ ముసుగులో ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని మండిపడ్డారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ విదేశీ కంపెనీలకు విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, దీనిని నిరసిస్తూ ఈనెల 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై తమ నిరసనను తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, భారతి, వెంకటేశ్వరమ్మ, కమల బీబీ, రమాదేవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో అధిక పోషకాలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాంతీయ సంచాలకులు పద్మజ

చెన్నూరు : చిరుధాన్యాలలో అధిక పోషకాలు ఉండటం వల్ల వీటిని గర్భిణులు, బాలింతలు తీసుకున్నట్లయితే రక్తహీనత తగ్గి ఆరోగ్యంగా ఉంటారని, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ప్రాంతీయ ఉప సంచాలకులు పద్మజ తెలిపారు. చిరుధాన్యాలు–పోషణ్ పక్వాడలో భాగంగా శనివారం స్త్రీ శక్తి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చిరు ధాన్యాల గురించి, వాటి ప్రాముఖ్యతను గురించి తెలుసుకోవాలన్నారు. ప్రజలు ఫాస్ట్‌ఫుడ్ పదార్థాలకు అలవాటు పడుతున్నారని, దీని ద్వారా ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కొన్ని సార్లు ప్రాణాపాయస్థితి కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి వంశీకృష్ణ, కడప మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జీఎస్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, సీడీపీఓ ప్రభావతి, ఏపీఎం గంగాధర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను వేగవంతం చేయండి



షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని పాత మార్కెట్‌లో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. షాపింగ్ కాంప్లెక్స్ గదుల నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

కిలో రూ. 6కు తగ్గిన టమాట

కడప అగ్రికల్చర్: రైతు బజార్‌లో టమాటల ధర బాగా తగ్గింది. మొన్న మొన్నటి దాకా కిలో రూ. 25 వరకు టమాట ధర ఉండేది. ఆ తరువాత కిలో రూ. 20, 15, 12 రూపాయలు ఇలా ధర తగ్గుతూ వచ్చింది. అయితే శనివారం రైతు బజార్‌లో కిలో టమాటల ధర కేవలం రూ. 6 పలికింది. దీంతో వినియోగదారులు అధిక మోతాదులో తీసుకుని వెళ్లారు.

గతంలో టమాటలు మదనపల్లె, చింతామణి ప్రాంతాల నుంచి రావడంతో ధరలు అధికంగా ఉండేవని మార్కెట్ వ్యాపారులు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని సీకేదిన్నె, వల్లూరు, పెండిమర్రి, వేంపల్లి, వేముల, మైదుకూరు ప్రాంతాల నుంచి టమాటలు వస్తుండటంతో ధరలు బాగా తగ్గాయని వారు చెబుతున్నారు. కాగా టమాటల ధర తగ్గడంతో రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని కొంతనష్టం వాటిల్లక తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలకు క్రీడాసామగ్రి వితరణ



పాఠశాల హెచ్‌ఎం, పీడీకి క్రీడాసామగ్రి అందజేస్తున్న శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ఆర్‌ఎం

కడప స్పోర్ట్స్/చెన్నూరు : చెన్నూరు మండలం రామనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడావిభాగానికి రూ.1.25 లక్షల విలువచేసే క్రీడా సామగ్రిని వితరణగా అందజేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ సంస్థ రీజినల్ మేనేజర్ గిరిధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పాఠశాల హెచ్‌ఎం ఓ. రఘునాథరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కె. రెడ్డయ్యకు క్రీడాసామగ్రిని అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం రఘునాథరెడ్డి, పీడీ రెడ్డయ్యలు మాట్లాడతూ 40 జతల క్రీడాదుస్తులు, వాలీబాల్ నెట్స్, ఐరన్‌పోల్స్, నెట్‌బాల్, ఫుట్‌బాల్, క్రికెట్ కిట్, వెయిట్‌లిఫ్టింగ్, కోలాటం తదితర సామగ్రిని అందజేయడం సంతోషంగా ఉందన్నారు.

నో స్కూల్ బ్యాగ్ డేతో మానసిక ఉల్లాసం



ఆట వస్తువులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చాపాడు : ప్రభుత్వం ఇటీవల పాఠశాలల్లో ప్రవేశపట్టిన నో స్కూల్ బ్యాగ్ డే కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలుగుతుందని హెడ్ టీచర్ జవహర్ మున్నీర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం నో స్కూల్ బ్యాగ్ డే కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆట వస్తువులను తయారు చేయించటం నేర్పించామన్నారు. వీటితో పాటు విద్యార్థులు పాటలు, ఆటల పోటీలు నిర్వహించామన్నారు. ప్రతి నెలా మొదటి, మూడవ శనివారం క్రమం తప్పకుండా నో స్కూల్ బ్యాగ్ డే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వీటి ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత బయటికి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలను ఇప్పించాలి

ప్రొద్దుటూరు క్రైం : వ్యాధి నిరోధక టీకాలను పిల్లలకు తప్పక ఇప్పించాలని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి హనీఫ్‌బాబా తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని నక్కలదిన్నె, గోపవరం, కొత్తపేట, చౌటపల్లె సచివాలయాల్లో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం 100 శాతం పూర్తి కావాలన్నారు. కార్యక్రమంలో మరో వైద్యాధికారి శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగర శివార్లలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలో శనివారం ఉదయం సీతారాముల కల్యాణం నిర్వహించారు. 45వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని జరిపారు.